క్లుప్తంగా

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



మామిడి పళ్ల అలంకారంలో కనకదుర్గమ్మ

పెందుర్తి: సౌభాగ్యరాయపురం (ఎస్ఆర్ పురం)లో కొలువు దీరిన కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం మామిడి పళ్ల దండలు వేసి అలంకరణ చేశారు. నైవేద్యం సమర్పించారు. ఆలయ ధర్మకర్త కాయితి ఎర్రి బాబు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మధురవాడకు చెందిన వేదనభట్ల రామ సత్యనారాయణ దంపతులు శుక్రవారం రూ.లక్ష 116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దాతకు ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ అందించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

రావాడలో రీ సర్వే ప్రారంభం



భూముల రీసర్వేను ప్రారంభిస్తున్న నాయకులు

పరవాడ: రావాడ గ్రామ పంచాయతీలో చేపట్టిన భూముల రీ సర్వేను కూటమి నాయకుడు పంచకర్ల ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి నష్టం లేకుండా రీ సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పరవాడ తహసీల్దారు ఎస్వీ అంబేడ్కర్, సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, మండల సర్వేయర్ సాయికిరణ్, రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి



శంకరాచార్యునికి పూజలు చేస్తున్న స్వామీజీలు

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో శంకర జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా శంకరాచార్యులకు పూజలు చేశారు. పీఠం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కిశోర బాలికలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెందుర్తి: పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిశోర బాలికల శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేపగుంట ముత్యమాంబ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని అపార్ట్‌మెంట్ వద్ద జరిగిన అవగాహన సదస్సులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాలికల హక్కులు, చట్టాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి నాగమణి, ఏఎన్ఎం సునీత, ఆశ కార్యకర్త దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.



పరవాడలో ఓ కార్మికుడి మృతికి కారణమైన తుక్కు దుకాణం



పరవాడలో కొత్తగా సిద్ధం చేస్తున్న తుక్కు దుకాణం



లంకెలపాలెం- సబ్బవరం రహదారి పక్కన ఏర్పాటు చేసిన తుక్కు దుకాణం

పుట్ట గొడుగుల్లా తుక్కు దుకాణాలు

- నిబంధనలకు తూట్లు
- పరిసర ప్రాంతవాసుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

పరవాడ: పుట్టగొడుగుల్లా వెలుస్తున్న తుక్కు దుకాణాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ దుకాణాల్లోని పాత ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లు, వ్యర్థాలను అక్కడే కాల్చడంతో పొగతో పరిసరప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న ఈ దుకాణాలపై రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో పరవాడ, ఫార్మాసిటీ కాలనీ, తానాం, భర్నికం, ధర్మారాయుడుపేట, వాడచీపురుపల్లి, లంకెలపాలెం ప్రాంతాల్లో నివాసాల మధ్య రహదారుల పక్కన స్క్రాప్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రహదారులు, జనావాసాలు, పెట్రోల్ బంకులు ఉన్న ప్రాంతాల్లో తుక్కు దుకాణాలు నిర్వహించకూడదన్న నిబంధనలను నిర్వాహకులు పాటించడం లేదు. గతంలో పరవాడ, లంకెలపాలెం ప్రాంతాల్లో రెండు, మూడు తుక్కు దుకాణాలు మాత్రమే నడిచేవి. ప్రస్తుతం ఇదే ప్రాంతాల్లో సుమారు 15 తుక్కు దుకాణాలు నడుస్తున్నాయి. ఇంకా పుట్టుకొస్తూనే ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

గ్రామీణ ప్రాంతాల్లో సైకిళ్లు, వ్యాన్లపై తిరుగుతూ చిరు వ్యాపారులు సేకరించిన ప్లాస్టిక్ సామాన్లు, ఇనుప వస్తువులను దుకాణదారులు కొనుగోలు చేయడంతో పాటు పరిశ్రమల నుంచి ప్లాస్టిక్ డబ్బాలను కొనుగోలు చేసి గొడౌన్లలో నిల్వ చేస్తున్నారు. వాటిని వ్యాన్లు, లారీలతో ఎగుమతి చేస్తూ సొమ్ము చేసుకుంటున్నా అధికారుల పర్యవేక్షణ లేక ప్రభుత్వాదాయానికి గండి పడుతోంది.

పెరుగుతున్న కాలుష్యం

తుక్కు దుకాణదారులు కొనుగోలు చేసిన ప్లాస్టిక్ వస్తువులు, విద్యుత్ వైర్లు, పాత డ్రమ్ములు, టైర్లను దుకాణాల వద్ద తగలబెట్టడంతో దట్టమైన మంటలు, పొగ కమ్ముకుని భరించలేని దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తగలబెట్టడం, పరిశ్రమల్లో కొనుగోలు చేసిన ప్రమాదకరమైన రసాయనాలను చెరువులు, కాలువల్లో వేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఫలితంగా జలం కలుషితమై మనుషులతో పాటు పశువులకు నష్టం వాటిల్లుతోంది. స్క్రాప్ దుకాణాల్లో తరచూ సంభవిస్తున్న అగ్ని ప్రమాదాల వలన పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడి, దట్టంగా కమ్ముకుంటున్న పొగతో ఉక్కిరిబిక్కిర వుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రమాదాల వలన జీడి, తాటి తోటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలెన్నో..

తుప్పు పట్టిన ఇనుప వస్తువులు, పాత డబ్బాలు, ప్లాస్టిక్ వస్తువులను అధిక మొత్తంలో నిల్వ చేయడంతో దోమలు పెరిగిపోతున్నాయి. నిల్వ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలు విష జంతువులకు ఆవాసాలుగా మారుతున్నాయి. రోడ్ల సమీపాన ఏర్పాటు చేసిన తుక్కు దుకాణాల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చిరు వ్యాపారులు తెచ్చిన వ్యర్థాలను కొనుగోలు చేసిన సమయంలో జారిపడిన ఇనుప మేకులు రోడ్డున వెళ్లే వాహనాల టైర్లకు గుచ్చుకోవడం వల్ల టైర్లకు పంక్చర్లు పడుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్న ఈ తుక్కు దుకాణాలపై అధికారులెవరూ తనిఖీలు జరుపుతున్న దాఖలాలు కనిపించడం లేదు.



రెండేళ్ల క్రితం పరవాడలో ఓ తుక్కు దుకాణంలో జరిగిన అగ్నిప్రమాద దృశ్యం(ఫైల్)

గతంలో జరిగిన ప్రమాదాలు

- గత నెల 8న పరవాడ మండల కాంప్లెక్సు సమీపంలోని ఓ తుక్కు దుకాణంలో ప్రమాదం సంభవించింది. అచ్యుతాపురం ఎస్ఈజెడ్ ఫార్మా పరిశ్రమల నుంచి కొనుగోలు చేసిన రసాయన డ్రమ్ములను పరవాడ తుక్కు దుకాణానికి తరలించి, అక్కడ దింపుతున్న క్రమంలో డ్రమ్ములో మిగిలి ఉన్న రసాయనం పడాల హరనాథ్ అనే కార్మికుడిపై పడింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- 2023 మేలో పరవాడ సమీపంలో ఓ తుక్కు దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతులకు చెందిన జీడిమామిడి, తాటి తోటలకు తీవ్ర నష్టం జరిగింది.

జనసంచారం లేని ప్రాంతాలకు తరలించాలి



తుక్కు దుకాణాలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి. ఇళ్లకు అతి సమీపంలో దుకాణాలను నిర్వహించడం వల్ల దోమలు పెరిగిపోయి ఇబ్బంది పడుతున్నాం. రోడ్లపై వాహనాలను నిలిపి, లోడ్ చేస్తున్న క్రమంలో లారీ, వ్యాన్లపై నుంచి రాలిపడుతున్న ఇనుప మేకులు వాహనాల టైర్లకు గుచ్చుకుని పాడవుతున్నాయి. పాదచారులు గాయపడుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెట్టినప్పుడు దట్టమైన పొగ వ్యాపించి, వాయు కాలుష్యం పెరిగిపోతోంది.

– గెద్దం బాబూరావు, స్థానికుడు, వాడచీపురుపల్లి

అధికారుల పర్యవేక్షణ అవసరం



దుకాణదారులు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, ఇష్టానుసారం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడుతోంది. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– గనిశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ నాయకుడు

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



తుక్కు దుకాణదారులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం. చోరీ సామగ్రిని కొనుగోలు చేయకూడదు. దుకాణాల్లో ప్రమాదం సంభవించి, కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే దుకాణ యజమానులపై చర్యలు తప్పవు. ఇటీవల పరవాడలో ఓ కార్మికుడి మృతికి కారణమైన దుకాణ యాజమాన్యంపై కేసు నమోదు చేశాం.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



మృతుడు కృష్ణ

పరవాడ: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి.. మండల పరిధి గొర్లివానిపాలెం టిడ్కో కాలనీలో గుండేపల్లి కృష్ణ (30) తల్లి రమణతో కలసి నివసిస్తున్నాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న కృష్ణకు ఇంకా వివాహం కాలేదు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన కృష్ణ, మళ్లీ మద్యం సేవించేందుకు తల్లిని డబ్బులు అడిగాడు. తల్లి డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపం చెంది, ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెళ్లి కాలేదన్న కారణంతో మద్యానికి బానిస అయ్యాడని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గంలోని మూడు మండలాల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. పెందుర్తి, సబ్బవరం, పరవాడ యువజన విభాగం అధ్యక్షులుగా ఎం.దిలీప్ కుమార్, బోకం శ్రావణ్‌కుమార్, బండారు శ్రావణ్ కుమార్, ఆయా మండలాల ఎస్సీ విభాగం మండల అధ్యక్షులుగా మువ్వల వెంకటరమణ, దువ్వ దుర్గాలు, ఈదులపాక సన్యాసిరావు నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

పరవాడ: గాజువాక-యలమంచిలి రహదారిలో రావాడ శివారు ధర్మారాయుడుపేట కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం ఓ బాలిక మృతి చెందింది. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలివి.. అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామానికి చెందిన కాకి శ్రీను, భార్య రేవతి, కుమార్తె లిఖిత (7), కుమారుడు దీక్షిత్‌తో కలిసి పెదగంట్యాడలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ధర్మారాయుడుపేట కూడలి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన కారు వీరి వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. అదే సమయంలో ఎదురుగా మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొనడంతో తల్లిదండ్రుల మధ్య వాహనంపై కూర్చున్న లిఖిత రోడ్డుపై తుళ్లిపడింది. దీంతో తలకు తీవ్ర గాయమై, అపస్మారక స్థితికి చేరుకుంది. గాయపడిన బాలికకు పరవాడ పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి, అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో బాలిక తల్లిదండ్రులు, తమ్ముడు దీక్షిత్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా..



ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అదీప్‌రాజ్ తదితరులు

- సబ్బవరంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయం
- రేపు ప్రారంభోత్సవం
- హాజరు కానున్న పార్టీ ముఖ్యనేతలు బొత్స, అమర్‌నాథ్, బూడి
- పార్టీ సమన్వయకర్త అదీప్‌రాజ్ వెల్లడి

సబ్బవరం: ప్రజలకు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండేలా సబ్బవరంలో ఈ నెల 4న పార్టీ నియోజకవర్గస్థాయి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు పార్టీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సబ్బవరంలోని ఐరువాడ సమీపంలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న కార్యాలయాన్ని పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిందన్నారు. అధికారంలోకి వచ్చి సుమారు సంవత్సరం అవుతున్నా, తమ అధికారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలు, దాడులకు పాల్పడేందుకే వినియోగిస్తోంది తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల తరఫున పోరాడేందుకు, అందరికీ నిత్యం అందుబాటులో ఉండేలా ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. పార్టీ కార్యాలయం ఎదురుగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, పార్టీ జెండాను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

భారీ బైక్ ర్యాలీతో స్వాగతం

ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ హాజరవుతారని అదీప్‌రాజ్ తెలియజేశారు. ముందుగా సాయంత్రం జోడుగుళ్ల వద్ద ముఖ్యఅతిథులకు భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, మండల కన్వీనర్ కర్రి బాబు, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, పార్టీ జిల్లా మాజీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి వనం అచ్చెంనాయుడు, వడ్డాది అప్పలరాజు, దనిమిరెడ్డి శ్రీనివాస్, గొర్లి రాజేష్, కర్రి శ్రీనివాసరావు తదితరులున్నారు.

సమష్టి కృషితో మండల అభివృద్ధి

- పరవాడ ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి



సమావేశానికి హాజరైన అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

పరవాడ: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా మండలంలో అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీటీసీలకు కేటాయించిన రూ.10 లక్షల నిధులతో ప్రజోపయోగ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు గిట్టుబాటు వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో పల్లె ప్రజలకు తాగునీటి ఎద్దడి సమస్యలు లేకుండా చూడాలన్నారు. పాడైన మంచినీటి బోర్లు, వాటర్ ట్యాంకులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. జల్‌జీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి, జిల్లాలో ప్రథమంగా నిలిచిన పెదముషిడివాడ పాఠశాల విద్యార్థులను ఎంపీపీ అభినందించారు. ప్రజాప్రతినిధులకు సమస్యలుంటే నేరుగా ఎంపీడీవో, ఎంపీపీలను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.

అధికారుల దృష్టికి సమస్యలు

మండలంలో బెల్ట్ దుకాణాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు కోరారు. సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని సబ్బవరం ఎక్సైజ్ ఎస్ఐ రమణ చెప్పారు. పరవాడ బీసీ కాలనీలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును తొలగించి కొత్త ట్యాంకు నిర్మించాలని సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు కోరారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో వి.ధర్మారావు, తహసీల్దారు ఎస్వీ అంబేడ్కర్, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్, చోరీలపై స్థానిక సినిమా హాలు కూడలిలో శుక్రవారం రాత్రి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత డేటా, ఓటీపీలు ఇతరులతో పంచుకోకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగం ప్రాణాలకు ముప్పు తెస్తుందని, వేగ నియంత్రణ విధిగా పాటించాలని హితవు పలికారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలను వాహనదారులు తప్పనసరిగా వెంట పెట్టుకోవాలన్నారు. చోరీల నియంత్రణకు దుకాణాల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న హోటల్స్ సంఘం ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ సంఘం(హెచ్ఆర్ఏపీ) ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం అంతర హోటల్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 హోటల్ జట్లు పాల్గొంటున్నాయి. హోటల్స్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. హోటల్ సిబ్బంది మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని సంఘం ఉపాధ్యక్షుడు పవన్ కార్తీక్ ఈ సందర్భంగా తెలిపారు. స్టార్ కేటగిరీ హోటల్స్ మేనేజర్లు, హెచ్ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు. టోర్నీలో భాగంగా తొలిరోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ది పార్క్ హోటల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. మేఘాలయ హోటల్ నిర్దేశించిన 47 పరుగుల విజయ లక్ష్యాన్ని కేవలం 4.4ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. రెండో మ్యాచ్‌లో రాక్‌డేల్ హోటల్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఐటీ ఫార్చ్యూన్ ఇన్ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులే చేసి ఓటమి పాలైంది. మూడో మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పామ్ బీచ్ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి 188 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఫోర్ట్ హోటల్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 47 పరుగులు మాత్రమే చేయగలిగింది.

ఎస్ఐపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

పెందుర్తి: తన దుకాణం వద్ద మద్యం సేవిస్తుండగా పెందుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత తనను కొట్టారని పెందుర్తి మండలం పెదగాడికి చెందిన గళ్ల వెంకటనర్సయ్య అనే వ్యక్తి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. తన సెల్‌ఫోన్ లాక్కుని కడుపులో, కన్ను మీద దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా ఈ ఘటనపై సీఐ కేవీ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా.. నలుగురు వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తుండగా ఎస్ఐ అసిరితాత వారిని పట్టుకున్నారని చెప్పారు. శాంతిభద్రతలు కాపాడే విషయంలో వారిని గట్టిగా మందలించారన్నారు. ఈ కేసుపై పూర్తిస్థాయి విచారణ చేస్తామని పేర్కొన్నారు.